క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

తాళ్లరేవు: కాపులపాలెంలో ఉన్న శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామివారి ఆలయం పునర్నిర్మాణానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులు మోపూరి వెంకటరెడ్డి నాయుడు, శేషమణి దంపతులు పీటలపై కూర్చుని శాస్త్రోక్తంగా శంకుస్థాపన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టిల్లపూడి నాగేశ్వరరావు, టీడీపీ ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాట్ల సుబ్బరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పితాని బాలకృష్ణ, కాటంశెట్టి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి భూమి పూజ

కాట్రేనికోన: బ్రహ్మసమేధ్యం పంచాయతీ బలుసుతిప్ప పాతపేటలో రామాలయం నిర్మాణానికి న్యాయవాది స్వామి నాయకర్ దంపతులు, తిరుమాని సత్తిబాబు దంపతుల చేతుల మీదుగా భూమి పూజ చేశారు. పేరూరుకు చెందిన వేద పండితుల పర్యవేక్షణలో గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచకావ్యాశనం, దీక్షాధారణ, అంకురార్పణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు, ఆదినారాయణ, ఇసుకపట్ల శ్రీనుబాబు, ఓలేటి సతీష్, బర్రే రాంబాబు, కామాడి గంగాద్రి, పెమ్మాడి రాముడు, సంగాని చిన్ని తదితరులున్నారు.

ఆటపాటలతో విద్యార్థుల సందడి



గొల్లవిల్లి పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులు శుక్రవారం ఫేర్‌వెల్ ఫంక్షన్‌ను జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా కలిసి తమ ఆటపాటలతో, నృత్యాలతో సందడి చేశారు. అనంతరం వారికి విద్యను బోధించిన ఉపాధ్యాయులను సత్కరించి గురువులపై తమ అభిమానం చాటుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లంకా రాణి, పీఎంసీ చైర్మన్ దోనిపాటి రమావెంకటరమణ, వైస్ చైర్మన్ సుందరనీడి వీరవేణి, పీడీ గొలకోటి ఫణీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొని పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులంతా మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.

అమలాపురంలో కాంగ్రెస్ ధర్నాలు

అమలాపురం టౌన్: రాహుల్‌గాంధీపై తప్పుడు కేసు బనాయించి శిక్ష పడేలా కుట్ర పన్నారని ఆరోపిస్తూ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్, గడియారం స్తంభం సెంటరులో శుక్రవారం వేర్వేరుగా ధర్నాలు నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నా అనంతరం డీఆర్వో సీహెచ్ సత్తిబాబుకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ ధర్నాల్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, అయితాబత్తుల సుభాషిణి, వంటిద్దు బాబి, దేవరపల్లి రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న రథం వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కల్యాణోత్సవాల సమయంలో స్వామి వారిని బయటకు తీసుకొచ్చేందుకు రథం వెళ్లేందుకు సరైన దారి లేక అవస్థలు పడాల్సి వస్తోంది. దీనికి శాశ్వత పరిష్కారంగా రథశాల నుంచి ఎదురుగా ఉన్న 216 జాతీయ రహదారి వరకూ 12 మీటర్ల మేర రూ.1.30 లక్షల వ్యయంతో సీసీ రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ నెల 28 నుంచి జరిగే స్వామి కల్యాణోత్సవాల సమయానికి రథాన్ని సిద్ధం చేస్తున్నట్లు ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వినీతాదేవి తెలిపారు.

ఏటిగట్టుపై కారు బోల్తా

తాళ్లరేవు: గౌతమి గోదావరి ఏటిగట్టు రహదారిపై గోవలంక వద్ద శుక్రవారం రాత్రి కారు బోల్తా పడిన ఘటనలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. కోరంగి ఎస్‌ఐ పి.శ్రీనివాసకుమార్ తెలిపిన వివరాల మేరకు రాజమండ్రికి చెందిన నలుగురు యువకులు కారులో యానాం వచ్చారు. యానాంలో మద్యం తాగి తిరిగి ఏటిగట్టు రహదారిలో జొన్నాడ వైపుకు వెళుతుండగా గోవలంక గ్రామం వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో కాకినాడ తరలించగా చికిత్స పొందుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

యానాం: యానాం దరియాలతిప్ప రహదారిలో ఆర్‌ఐటీ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయంలో అతివేగంగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వాహన చోదకులు ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తి చికిత్స పొందుతున్నాడు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది.

ఫలిస్తున్న ఆయుష్ చికిత్స

- యానాం ప్రభుత్వ ఆయుష్ కేంద్రం ద్వారా సత్ఫలితాలు
- ఆయుర్వేదం, హోమియోపతి, పంచకర్మలతో మెరుగైన చికిత్సా విధానాలు


పంచకర్మ వైద్యానికి వనమూలికలతో సిద్ధం చేస్తున్న ఆయుర్వేద మందు


కాళ్ల సంబంధిత వ్యాధికి చికిత్స చేస్తున్న వైద్యులు

యానాం: ఆయుః అంటే జీవితం.. వేద అంటే శాస్త్రం.. ఈ రెండు సంస్కృత పదాల సంయోగమే ఆయుర్వేదం.. ఆయుర్వేదమన్నది జీవితం యొక్క శాస్త్రం. ఇతర వైద్య విధానాల్లా కాకుండా వ్యాధుల చికిత్స కంటే ఆరోగ్యకరమైన జీవనంపై దృష్టి పెడుతుంది. యానాంలోని ప్రభుత్వ ఆయుష్ ఆసుపత్రిలో ఉచితంగా అందించే ఆయుర్వేదం, నేచురోపతి, యోగా, హోమియోపతి, పంచకర్మ చికిత్సా విధానాల ద్వారా వివిధ వ్యాధులు నయమవుతుండటంతో అధిక సంఖ్యలో రోగులు ఈ ఆసుపత్రికి యానాం పరిసర ప్రాంతాల నుంచి వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే డిస్పెన్సరీగా ఉన్న ఈ ఆసుపత్రిని పుదుచ్చేరి ప్రభుత్వం ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేసింది.

యానాం ఆయుష్ విభాగం ముందడుగు

ఆయుర్వేదం... ఆయుర్వేదం ద్వారా కీళ్లనొప్పులు, చర్మవ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులైన ఆస్తమా, ఆర్థరైటిస్ తదితరమైన వాటికి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. ఈ వ్యాధులకు కేరళ, మధ్యప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాల నుంచి ప్రత్యేకమైన మందులతో పాటు, ప్రకృతిలో లభించే వనరులతో స్థానికంగా కొన్ని మందుల్ని వైద్యులు తయారుచేస్తున్నారు.

పంచకర్మ విధానానికి పెరుగుతోన్న ఆదరణ

పంచకర్మ ద్వారా పక్షవాతం, స్పాండిలైటిస్ తదితర వ్యాధులకు నూనెలను వేడి చేసి ఆవిరి పట్టించడం, మెడిసిన్ మిక్స్ చేసి మసాజ్ థెరపీ ద్వారా సత్ఫలితాలు సాధిస్తున్నారు. తలపోటు, తల ఊడిపోతున్న వారికి శిరోధార చికిత్స విధానం ఉంది. డయాబెటిస్‌తో బాధపడుతూ జాయింట్ పెయిన్స్, కాళ్ల నొప్పులుకు చికిత్స అందిస్తున్నారు.

హోమియోపతి ద్వారా అద్భుత ఫలితాలు

60 ఏళ్లు పైబడి జీరియాట్రిక్ సమస్యలు ఉన్నవారికి నెలకొకసారి మొదటి బుధవారం పరిశీలించి నెలరోజులకు సరిపడా హోమియోపతి మందులను అందిస్తున్నారు. గర్భిణులకు, బాలింతలకు, అప్పుడే పుట్టిన బిడ్డలకు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా వాడగల మందులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థుల జ్ఞాపక శక్తికి, ఆస్తమా, థైరాయిడ్, స్త్రీలకు సంబంధించి పీసీఓఎస్, సారియాసిస్‌కు హోమియోలో మంచి వైద్యాన్ని అందిస్తున్నారు.

నేచురోపతిలో థెరపీలు

నేచురోపతిలో డైట్, జీవన విధానంలో మార్పుల ద్వారా ఆరోగ్యాన్ని ఏ విధంగా కాపాడుకోవచ్చో చెబుతున్నారు. వివిధ కేటగిరిల్లోని మడ్ థెరపీ, సీడ్ థెరపీ, ఆక్యుపంచర్, ఆక్యుప్రెజర్, మేగ్నటిక్ థెరపీ చికిత్సలు అందిస్తున్నారు. ముఖ్యంగా మేగ్నటిక్ థెరపీ ద్వారా మణికట్టు పెయిన్స్ తదితర వ్యాధులను నయం చేస్తున్నారు.

యోగాతో మార్పు

కోవిడ్ వచ్చిన వారిలో ప్రాణాయామం ద్వారా లంగ్ కెపాసిటీని పెంచడం, వారానికి రెండు సార్లు వైద్యులు యోగాథెరపీని ప్రదర్శిస్తున్నారు. వాటిని రోగులు అనుసరిస్తున్నారు. ఆయుష్ ప్రాధాన్యతను తెలపడానికి ముఖ్యంగా చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్నారు. అదేవిధంగా ఫుడ్ కాంపిటేషన్‌లు నిర్వహించి పౌష్టికాహార విలువలున్న ఆహారం ఎలా తయారుచేయాలో తెలియజేస్తున్నట్లు డాక్టర్ పురుషోత్తం(ఆయుర్వేద), డాక్టర్ దుర్గ(పంచకర్మ), డాక్టర్ శ్రీనాథ్(ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్), డాక్టర్ గ్లోరీకుమారి(హోమియోపతి), డాక్టర్ రవీంద్రలు తెలిపారు.

దీర్ఘకాలిక వ్యాధులకు సైతం చికిత్స



యానాం ఆయుష్ ఆసుపత్రి ద్వారా వివిధ దీర్ఘకాలిక వ్యాధులకు సైతం మెరుగైన చికిత్సను అందిస్తున్నాం. ఆయుష్‌కు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది.

– డాక్టర్ స్టాన్లీ స్టీవెన్‌సన్, ప్రధాన వైద్యాధికారి, ఆయుష్, యానాం

ప్రణాళికబద్ధ అభ్యాసంతోనే ఉన్నత శిఖరాలు : కలెక్టర్


తరంగ్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు

అమలాపురం టౌన్: పాఠశాల స్థాయి నుంచి విద్యను అభ్యసించే విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించొచ్చని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. స్థానిక విద్యానిధి స్కూలులో శుక్రవారం రాత్రి జరిగిన 21వ వార్షికోత్సవ సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలను కలెక్టర్ శుక్లా, చెన్నై అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ ఫణీంద్ర జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూలులో నిర్వహించిన తరంగ్–2023 కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన పలు విజ్ఞాన, వినోద ప్రదర్శనలను తిలకించి అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కామనగరువులో చోరీ

రూ.లక్ష విలువైన కేజిన్నర వెండి అపహరణ


కామనగరువులో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ అందే పరదేశి

అమలాపురం రూరల్: మూడు నెలలుగా తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి వెండి చోరీ చేసిన ఘటన మండలంలోని కామనగరువులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కామనగరువు సుబ్బాలమ్మ తల్లి తాడిచెట్టు సమీపంలోని ఇంట్లో నివాసముండే శిరిగిబత్తిన జగదీష్‌గౌడ్ గతేడాది డిసెంబర్ నెలలో అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు ఆ ఇంటికి తాళం వేసి వేరే ఇంట్లో ఉంటున్నారు. గురువారం ఇంటికి వచ్చి చూస్తే తలుపులు తెరిచి ఉండడంతో పాటు బీరువాలో రూ.లక్ష విలువైన కేజిన్నర వెండిని అపహరించుకుపోయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ అందే పరదేశి సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరుని పరిశీలించారు. క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించారు. జగదీష్‌గౌడ్ కుమారుడు శిరిగిబత్తిన సంజీవ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ డీలర్ల జీతాలకు రూ.7 కోట్లు కేటాయింపు

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్‌లలో రేషన్ షాపుల డీలర్లకు ఏళ్ల తరబడి బకాయి ఉన్న జీతాల కోసం రూ.7 కోట్లు కేటాయించినట్లు సీఎం రంగసామి ప్రకటించారు. శుక్రవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇచ్చే బియ్యానికి బదులు నగదును లబ్ధిదారుల అకౌంట్లలోకి వేస్తున్నామని, త్వరలో రేషన్‌షాపుల ద్వారా గోధుమ, ఆయిల్, పంచదార తదితరమైన సరకులు పంపిణీ చేస్తామన్నారు.

5న ఉచిత భోజన పథకం ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి

తాళ్లరేవు: తాళ్లరేవు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు ప్రతి బుధవారం ఉచితంగా భోజనం అందించే పథకాన్ని ఏప్రిల్ 5వ తేదీన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ప్రారంభించనున్నట్లు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం తాళ్లరేవు సామాజిక ఆస్పత్రిలో జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం సుమారు 100 మంది గర్భిణులకు ఉచితంగా అన్నదానం చేస్తారన్నారు. సమావేశంలో ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు ఎ.లక్ష్మీనారాయణ, లోవకుమారి తదితరులు పాల్గొన్నారు.

ధూళిపూడికి సత్కారం

ఐ.పోలవరం: మురముళ్ల మాణిక్యాంబ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు ధూళిపూడి బాబిని శుక్రవారం వర్తక సంఘ నేతలు ఘనంగా సత్కరించారు. ఫిబ్రవరి 18 నుంచి మార్చి 23వ తేదీ వరకు నిత్యం ఆలయ ఆవరణలో సుమారు 2 వేల మందికి అన్న సమారాధన నిర్వహించారని కొనియాడారు.

మహిళలకు సర్టిఫికెట్‌లు అందజేత


శిక్షణ పొందిన మహిళలతో సర్పంచ్ అరుణకుమారి తదితరులు

అమలాపురం రూరల్: కామనగరువు గ్రామంలో స్పందన స్ఫూర్తి సౌజన్యంతో 25 మంది మహిళలకు 3 నెలల పాటు కుట్టు మిషను ఉచిత శిక్షణను అందించారు. శిక్షణ తీసుకున్న మహిళలకు సింగర్ కుట్టు మిషన్ల సంస్థ పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన మహిళలకు కుట్టు మిషన్‌కు సంబంధించిన కిట్లు, ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రాలను సర్పంచ్ నక్కా అరుణకుమారి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో స్పందన అమలాపురం బ్రాంచ్ మేనేజర్ రవికుమార్, మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ కిరణ్‌కుమార్, ఎం.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్‌డీఆర్‌ఎఫ్ మాక్ డ్రిల్


ఆర్‌ఏఓ చాంబర్‌లో మాక్‌డ్రిల్‌పై చర్చిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: వరదల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం ఏర్పడకుండా తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై శనివారం ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ శాఖల అధికారులతో మాక్‌డ్రిల్‌ను నిర్వహిస్తున్నట్లు రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి తెలిపారు. శుక్రవారం మాక్ డ్రిల్ ముందస్తు ఏర్పాట్లలో భాగంగా స్థానిక ఆర్‌ఏఓ చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30కు గౌతమీగోదావరి రివర్ బీచ్ భారత మాత విగ్రహం వద్ద మాక్ డ్రిల్ ప్రారంభమవుతుందన్నారు. ఈ మాక్ డ్రిల్‌లో ఎన్‌డీఆర్‌ఎఫ్, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపకదళం, వైద్య, పీడబ్ల్యూడీ, విద్యుత్ తదితర కీలక శాఖలు పాల్గొంటాయన్నారు.

శ్రీరామచంద్రమూర్తి మృతికి సంతాపం

తాళ్లరేవు: సెంట్రల్ బ్యాంక్ మాజీ చైర్మన్ ఆకాశం శ్రీరామచంద్రమూర్తి మృతికి కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు సంతాపం తెలియజేశారు. శుక్రవారం ఆయన తాళ్లరేవులో మాట్లాడుతూ కోఆపరేటివ్ సెక్టార్‌లో సింగిల్ విండో విధానాన్ని ప్రారంభించినపుడు శ్రీరామచంద్రమూర్తి చేసిన సేవలు ఎనలేనివన్నారు.

వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి


నీలపల్లి రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించిన వ్యవసాయ శాఖ ఏడీఏ బాబూరావు

తాళ్లరేవు: ప్రభుత్వం ఆర్బీకే కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీపై అందజేస్తున్న వ్యవసాయ పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బాబూరావు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ఇంజరం, నీలపల్లి, పటవల రైతు భరోసా కేంద్రాలను ఆయన సందర్శించి సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంఘాల గ్రూపులకు వ్యవసాయ పరికరాలు అందజేస్తున్నామని, ఆర్బీకే కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. కొంతమంది రైతులు ఒక గ్రూపుగా ఏర్పడి వాటిని పొందొచ్చని చెప్పారు. ఆయన వెంట వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పెంపుడు కుక్క దాడి

కాట్రేనికోన: కాట్రేనికోన గేట్ సెంటర్ నుంచి జెడ్పీ హైస్కూల్ పాఠశాలకు వెళ్లే రోడ్డులో ఆటో స్టాండ్ వద్ద ఓ ఇంటి యజమాని పెంచుకుంటున్న కుక్క నిత్యం ఆ మార్గంలో వెళ్లే ఎవరొకరిపై దాడి చేస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం పాఠశాల నుంచి ఇంటికి వెళుతున్న విద్యార్థిపై ఆ పెంపుడు కుక్క దాడి చేయడంతో సైకిల్‌పై నుంచి కింద పడిపోయాడు. దీంతో స్థానికులు కుక్కను తరిమి చిన్నారిని లేవదీసి ఇంటికి పంపించారు. పెంపుడు కుక్కపై గతంలో పంచాయతీలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకారులకు ఓఎన్‌జీసీ పరిహారంపై చర్చ

అసెంబ్లీలో లేవనెత్తిన ఎమ్మెల్యే అశోక్

యానాం: సముద్రంలో ఓఎన్‌జీసీ సంస్థ రెండో గ్యాస్ పైపులైను వేస్తున్న నేపథ్యంలో వేట నష్టపోతున్న యానాం మత్స్యకారులకు రావాల్సిన పరిహారం ఆలస్యం కావడంపై శుక్రవారం పుదుచ్చేరి అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ మంత్రి లక్ష్మీనారాయణ సమాధానమిస్తూ పరిహారం కోసం మొత్తం 6,667 మంది దరఖాస్తు చేసుకున్నారని, విలేజ్ లెవల్ కమిటీల ద్వారా ఇప్పటివరకూ 50 శాతం దరఖాస్తుల విచారణ పూర్తయిందన్నారు. వీలైనంత వేగంగా మిగిలిన దరఖాస్తుల్ని పరిశీలించి లబ్దిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామని వెల్లడించారు.

యానాంలో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న ఫిషరీస్ డైరెక్టర్ పోస్టుని భర్తీ చేయాలని ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దూర ప్రాంత విద్యార్థుల కోసం క్యాంటీన్ ఏర్పాటుచేయాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్ర ద్వారా అమలుచేయాలన్నారు.

వేతన పెంపునకు కుటుంబసభ్యులతో కలిసి ఆందోళన


కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేస్తున్న పీడబ్ల్యూడీ ఎన్ఎంఆర్‌లు

యానాం: యానాం పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్(పీడబ్ల్యూడీ)లో 13 ఏళ్లుగా ఎన్ఎంఆర్‌లుగా పనిచేస్తున్న తమకు వేతనాలు పెంచాలని కోరుతూ శుక్రవారం స్థానిక పీడబ్ల్యూడీ శాఖ కార్యాలయం ఎదుట తమ కుటుంబ సభ్యులతో కలిసి సిబ్బంది ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్లుగా పనిచేస్తున్న తమకు వేతనాలు పెంచి డైలీ రేటెడ్ సిబ్బందిగా మార్పు చేయాలని, ఎంటీఎస్ పోస్టులు తమకు కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక పీడబ్ల్యూడీ కార్యాలయం ఎదుట ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆందోళనను కొనసాగించారు.

ఒకే కాండం... మూడు కాయలు


మూడు కాయలుగా కనిపిస్తున్న పనస కాయ

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఎం. వంశీచైతన్య ఇంటి ఆవరణలో ఓ పనస చెట్టుకు విభిన్న ఆకృతిలో ఒకే కాండానికి మూడు కాయలు కాశాయి. చెట్టు నుంచి కోసిన ఈ కాయను ప్రస్తుతం స్థానిక విద్యుత్ నగర్‌లోని గౌతమ మహర్షి అక్షయ పాత్రకు చెందిన ఆదిశేష నిలయంలో శుక్రవారం ప్రదర్శనగా ఉంచినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

క్షయ నివారణ అందరి బాధ్యత



ఉప్పలగుప్తం పీహెచ్‌సీలో క్షయ వ్యాధి నివారణకు ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది



జి.వేమవరంలో క్షయ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది


గోడిలంకలో క్షయ వ్యాధి నివారణపై ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

- ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా ర్యాలీలు
- టీబీ నివారణకు వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ

అల్లవరం: క్షయ వ్యాధి నివారణ అందరి సామాజిక బాధ్యతని వైద్యాధికారి సుమ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం పురస్కరించుకుని గోడిలంక పీహెచ్‌సీలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి సుమ మాట్లాడుతూ రెండు వారాల పాటు దగ్గు, సాయంత్రం సమయంలో జ్వరం, ఆకలి తక్కువగా ఉండటం, బరువు తగ్గడం వంటివి క్షయ వ్యాధి లక్షణాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బంది ఫ్లకార్డులు ధరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

తాళ్లరేవు: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం క్షయ వ్యాధి నివారణా ర్యాలీ నిర్వహించారు. స్థానిక హైస్కూల్ వద్ద నుంచి సీహెచ్‌సీ వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, డీసీఎస్ శిరీష, వైద్యులు, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా మండలంలోని కేశనకుర్రు, జి.వేమవరం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'టీబీ అంతానికి ఇదే సరైన సమయం' అన్న నినాదంతో ర్యాలీ, మానవహారం చేశారు. క్షయవ్యాధి నివారణకు డాట్స్ పద్ధతి ద్వారా మందులు ఉచితంగా అందిస్తున్నామని వైద్యులు కె.ఇందిరాశ్రీ, ఎం.రామానుజరావులు అన్నారు. రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం రావడం, బరువు తగ్గడం వంటివి టీబీ లక్షణాలుగా గుర్తించాలన్నారు.

ఉప్పలగుప్తం: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా మండలంలోని ఉప్పలగుప్తం, భీమనపల్లి పీహెచ్‌సీల్లో సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో ఫ్లకార్డులతో నినాదాలు చేశారు. క్షయ వ్యాధి నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, వైద్యాధికారులు ఎల్.నాగార్జున, ప్రసన్న, సీహెచ్‌వోలు వి.వరప్రసాద్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యానాంలో..

యానాం: క్షయ వ్యాధి లక్షణాలు, నివారణపై అందరూ అవగాహన ఏర్పరచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని రీజనల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జీజీహెచ్ వద్ద ఆరోగ్య సిబ్బంది ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. దరియాలతిప్ప, గిరియాంపేట, సావిత్రినగర్, మెట్టకూరు, పరంపేట పీహెచ్‌సీల్లో సైతం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ ర్యాలీలను నిర్వహించారు. కార్యక్రమంలో జీజీహెచ్ డీడీ టి.రవిశంకర్, వైద్యులు, నర్సులు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు కిట్ల పంపిణీ

ముమ్మిడివరం: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని ప్రభుత్వాసుపత్రి సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ అన్నారు. ప్రధాన మంత్రి టీబీ ముక్తా భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ సహకారంతో శుక్రవారం 10 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు రాగి పిండి, బెల్లం, కోడిగుడ్లతో కూడిన పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ క్షయ వ్యాధి ఊపిరితిత్తులకు సంబంధించినదైనా చర్మం నుంచి మెదడు వరకు సైతం వచ్చే అవకాశముంటుందని చెప్పారు. కార్యక్రమంలో పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కర్నీడి వెంకటేశ్వరరావు, సీహెచ్ శ్రీనివాసరావు, వెంకట సుధీర్, డి.నాగు, కార్తిక్, రాంజీ తదితరులు పాల్గొన్నారు.